కథానిక

# పట్టంచు రవిక

"భాస్కరభట్ల"

సరిగ్గా ఒంటిగంట అయింది. చప్పునలేచి టిఫిన్ మూటతో వేపచెట్టుకిందికి పరుగెత్తాను. అప్పటికే రఘు, రామనాథం, నారాయణ, విశ్వేశ్వరరావు టిఫిన్ మూటలు విప్పి నాకోసం ఎదురు చూస్తున్నారు. నేను వెళ్ళిందే తడవుగా "ఏంరా ఇంత ఆలస్యం చేసావనీ" విశ్వేశ్వరరావు అడిగాడు. నేనేమీ సమాధానం చెప్పకుండానే, చెట్టుకింద చతికిలబడి మూట విప్పాను. డబ్బామూత తీసి పక్కకి పెట్టడంతోనే, తక్కిన డబ్బాల్లోంచి, రొట్టెలు, పచ్చళ్ళు మూతలోకివచ్చి పడుతున్నాయి. విశ్వేశ్వరరావు డబ్బావేపు తిరిగాయి– "సేమియా ఉప్మా" జొన్న, గోధుమ రొట్టెల మధ్య, మినుకుమినుకుమనే నక్షత్రాల్లో చంద్రుడికి మల్లే ప్రకాశిస్తున్నది.

విశ్వేశ్వరరావు, రోజూ టిఫిన్ తీసుకురాడు. ఎన్నడో తోకచుక్కలాగా పూడిపడుతాడు. తెచ్చేపదార్థం ఎంతో రుచిగా వుంటుంది. మిగిలిన నలుగురి "మెనూ" ఏమాత్రం మారదు. గోధుమ, జొన్న రొట్టెలమధ్య రోజూ నలిగి చస్తుంటాం.

రుచిని బట్టిచూస్తే, పచ్చళ్ళలోకూడా చెప్పుకోదగ్గ మార్పేమీ వుండదు మా థర్డ్‌గ్రేడ్ జీవితాలకు మల్లేనే, రొటీన్‌గా రోజు ఆవకాయ, గొడ్డుకారపు చింతకాయ పచ్చడి మెదిగీ మెదగని కందిపచ్చడి ప్రత్యక్షమవుతాయి. విశ్వేశ్వరరావు ఎన్నడు టిఫిన్‌తో వేపచెట్టు కిందికివచ్చినా అతని వెంట ఒక కొత్త పదార్థం వస్తుంది. అదితింటూ, ఆవస్తువుని చేసిన యిల్లాలుని వేనోళ్ళ శ్లాఘించడం మాకు పరిపాటి అయిపోయింది.

టిఫిన్‌లు పంచుకున్న తరువాత, అందరం "సేమియా ఉప్మాతో" ఆనాటి మధ్యాహ్నపు విందు ప్రారంభించారు, ఉప్పూ కారం మోతాదులో ఉన్నాయి. ఉప్మాలో చిలికిన నిమ్మరసం, ఆకలిక ముపుల నోళ్ళని ఊరింపిస్తున్నది. రఘు ఉప్మా ముద్ద నోట్లో వేసుకుంటూ "విశ్వేశ్వరరావు నిజంగా చాలా అదృష్టవంతు"డన్నాడు.

"దేనికైనా పెట్టిపుట్టాలి" అని రామనాథం అందుకున్నాడు.

"నేను పెట్టిపుట్టానోలేదో తెలియదుగాని, రఘు చెప్పినట్లు నేను నిజంగా చాలా అదృష్టవంతుడిని" అన్నాడు.

విశ్వేశ్వరరావు "మా ఆవిడకు వంట ఏమాత్రం చాతకాదు. కొన్ని రోజులపాటు అది మీఆవిడ దగ్గర తర్ఫీదు పొందితే, నేను బతికిపోతా" నన్నాను—భవిష్యత్తుని గూర్చి కమ్మని కలలుకంటూ.

"ఒక్కరి భార్యేమిటి, నలుగురి భార్యలూ, ఆమెదగ్గర తర్ఫీదు పొందాలన్నాడు" నారాయణ నిక్కచ్చిగా.

"నిజమే"నని ఏకగ్రీవంగా, మేమందరమూ తలలూపాము.

'విశూ, ఇల్లాంటి భార్యను ఎల్లా సంపాయించావురా?" అని అడిగాడు రామనాథం.

"ఎల్లా సంపాయించానా? పెళ్ళిచేసుకొని సంపాయించా"నని అన్నాడు విశ్వేశ్వరరావు.

మేమందరం గొల్లుమన్నాము.

"చెప్పరా!" అని రెట్టించాడు రామనాథం - తన ప్రశ్నకి సరిఅయిన సమాధానం దొరకక.

"మీరు ఒక్క ఉప్మా చూచే ఆశ్చర్యపోతున్నారు! నా భార్యకు సంబంధించిన ఇతర విషయాలు వింటే, మీరామెను లేవదీసుకు పోతా" రన్నాడు విశ్వేశ్వరరావు నవ్వుతూ...

"గత్యంతరం లేకపోతే, అంతపనీ జరిగి తీరుతుంద"న్నాడు రఘు.

"మహావీరుడివి వెలిసావులేరా!" అన్నాడు నారాయణ.

"వాడిని అసలుసంగతి చెప్పనివ్వకండా, రామాయణంలో మీ పిడకలాట ఏమిటిరా!" అన్నాడు రామనాథం.

“అసలు సంగతి” వినడానికి మేమంతా సంసిద్ధపడ్డాం.

విశ్వేశ్వరరావు టిఫెన్ పూర్తిచేసి, సిగరెట్లు వెలిగించి పొగలమధ్య ప్రారంభించాడు. ఎందుకో మేమంతా ఎవరో ఆదేశించినట్లు సిగరెట్లు ముట్టించాం. పొగల్లో లీనమై వింటున్నాం. “ఉదయం కన్ను తెరిచేసరికి, మా ఆవిడ బెడ్ టీతో మంచం పక్కన ప్రత్యక్షమవుతుంది—టీ తాగి, వళ్ళు విరుచుకొని, మంచంమీదినించి లేవడంతోనే, మొహానికి వేడినీళ్ళూ, పేస్టు, బ్రష్, టవల్, సబ్బు సిద్ధంగా వుంటాయి మొహం కడుక్కొని నేను నేరుగా డ్రాయింగ్ రూమ్‌లోకి వెడుతాను. అక్కడ, ఆనాటి పేపర్, టిఫెన్ నాకోసం ఎదురుచూస్తుంటాయి. పేపర్ తిరగవేస్తూ, టిఫెన్ తీసుకుంటాను. టిఫెన్ అంటే హెవీ టిఫెన్ కాదు. బ్రెడ్, బట్టర్, ఒక్కగ్లాసు పాలు —పేపర్ పూర్తిచేసే సరికల్లా స్నానాల గదిలో వేడినీళ్ళు సిద్ధంగా వుంటాయి—స్నానంచేసి వంటగదిలోకి వెడుతాను. అక్కడ కంచంలో భోజనం నా రాకకోసం ఎదురిచూస్తూవుంటుంది—వంటగది గుమ్మంలోకి కాలుపెట్టడంతోనే, అన్నం కంచంలోకి వస్తుంది. భోజనం చేసిన తరువాత, తాంబూలం, ఆఫీసు దుస్తులతో, నాభార్య సిద్ధంగా వుంటుంది. కోటు తొడుగుతుంది. మూలమలుపు తిరిగేదాకా, యింటి గుమ్మంలోకి నాకు కళ్ళప్పగించి నిలిచి వుంటుంది. సరిగ్గా నాలుగింటికి ఆఫీసునించి బయల్దేరి, నాలుగున్నరకు, ఇంటికి చేరుకుంటాను.

మళ్ళీ కాళ్ళు కడుక్కోవడానికి వేడినీళ్లు సిద్ధంగా వుంటాయి. స్నానం చేయదలచుకుంటే, స్నానానికి నీళ్లుంటాయి. స్నానం చేసో, కాళ్ళు కడుక్కునో, డ్రాయింగ్ రూమ్‌లోకి వస్తాను. టీ ఎదురు చూస్తుంటుంది. టీ తాగి, షికారుకు వెళ్ళటమో, లేక ఏదైనా పుస్తకం చదువుకోడమో చేస్తాను. సాధారణంగా షికారుకు ఎక్కడికీ వెళ్ళను. ఇంట్లోనే కాలం గడుపుతాను. సాయంత్రం ఏడున్నరకి వంట అవుతుంది. స్నానంచేసి, తలలోని మల్లెపువ్వుల వంటి తెల్లచీరెతో, పట్టంచు రవికతో, నా భార్య నాకు వడ్డిస్తుంది. తనూ వడ్డించుకుంటుంది. ఇద్దరం కలసి భోజనం చేస్తాం. ఏ రంగు పువ్వులు తలలో పెట్టుకుంటే ఆ రంగు చీర కట్టుకోవడం, రవిక తొడుక్కోవడం మా ఆవిడకు అలవాటు. ఎప్పుడైనా లేతరంగు చీరలు కడుతుంది. కాని మామూలుగా తెల్లచీరలే. తెల్లచీరలంటేనే ఆమెకు ఎక్కువ యిష్టం. మా యింట్లో పని మనుషులెవ్వరూ లేరు. అన్నిపనులూ నా భార్యే చక్కదిద్దుకుంటుంది. నా కొచ్చే కొద్దిపాటి జీతంలో, దుబారా ఖర్చులు లేకుండా సంసారం చల్లగా గడిచిపోతుంది. భోజనంచేసి తాంబూలం వేసుకొని పడకగదిలో కాసేపు పచారు చేస్తాను. ఇంతలోకే, నా భార్య వంటయిల్లు శుభ్రంచేసి వస్తుంది.

ఇష్టాగోష్టితో కొంతకాలం గడుస్తుంది. ఆ తరువాత వళ్ళు తెలియని మైకంతో నిద్రపోతాం. ఇదీ మా నిత్యకృత్యం”ముగించాడు విశ్వేశ్వరరావు.

“మరి శలవురోజుల్లో?...” అన్నాడు రంగనాథం అర్థోక్తిగా “శలవుల్లో సాయంత్రంవరకూ, నేనెక్కడికీ వెళ్ళను. భోజనంచేసి కాసేపు పడుకుంటాను. మూడు గంటలకి టిఫెన్ సిద్ధమవుతుంది. శలవుల్లో ఉదయమేమీ టిఫెన్ ఉండదు. టిఫెన్ తీసుకుని, యిద్దరం ఏ పార్కుకో వెళ్ళి, సాయంత్రం దాకా గడిపి, మొదటి ఆట, ఏదైనా సినిమా చూస్తాం, సాధారణంగా శలవురోజుల్లో రొటీన్ తప్పించుకోవడానికి, ఏ గండీపేటకో, ఏ హిమాయత్ సాగర్‌కో వెడుతాం. వెళ్ళని రోజుల్లో, సినిమాకు పార్కుకు వెళ్ళడం జరుగుతుంది. “మొత్తంమీద అదృష్టజాతకుడవని” తలవని తలంపుగా మిత్రులం స్వరమేళంలో పలికాం. అప్పటికే రెండు గంటలు కావడం మూలాన ఆనాటికి మిత్రుల మంతా ఖైదీలకు మల్లే ఆఫీసు గదుల్లోకి వెళ్ళాం.

విశ్వేశ్వరరావు దినచర్య విన్నతరువాత అతని జీవితంపైన నాకు ఈర్ష్యకలిగింది. నాకే అల్లాంటి భార్యవుంటే జీవితం, సర్వాలంకారాలతో నందనవనంగా మారేదని తోచింది. నా భార్యకీ పొదుపరితనం ఏ కోశానాలేదు. నాకంటే ఎక్కువ దుబారాచేస్తుంది. జీతంరాళ్లు, సంసారానికి చాలవు, పిల్లలు, ఇల్లుపీకి పందిరవేస్తారు. యింట్లో ఎక్కడా శాంతి అనేది వుండదు. నన్ను నేను విశ్వేశ్వరరావుతో పోల్చి చూసుకున్నాను. నాకు మల్లే అంతనూ థర్డ్‌గ్రేడ్ లోనేవున్నాడు. నాకు కొన్ని

యింక్రిమెంట్లు వచ్చాయి. అతను కొత్తగా ఉద్యోగంలో చేరడంవల్ల, ఇంక్రిమెంటు ఒక్కటీరాలేదు సంపాదనలో అతనికంటే నేనే చాలా మెరుగు అయినా నేను అనుభవించలేని సుఖం, అతను జీవితంలో అనుభవిస్తున్నాడు నేనుకాదు, మిగిలిన నలుగురు మిత్రులం, మా జీవితాల్ని అతని జీవితంతో పోల్చి చూసుకున్నాం. మా జీవితాలు ఎంతో పేలవంగా కనపడ్డాయి. నిరర్థకంగా తోచాయి.

కొన్ని రోజుల తరువాత, ఒకనాడు విశ్వేశ్వరరావు, తిరిగి వేపచెట్టు కిందికి వచ్చాడు.

ఆతురతగా డబ్బాలమూతలు విప్పుకొన్నాయి, విప్పుకున్న మాతల్లో "ఆలూభాత్" వెలిసింది. ఎనమిది కళ్ళు జిగేలుమన్నాయి నాలుగు నాలికలు ఆ కళ్ళతో కొరకొర లాడాయి జొన్న, గోధుమ రొట్టెలు, తమని ఆదరించే వాళ్ళలేక మొగాలు ముడుచుకున్నాయి.

"విశూ, మీ యింటికి మమ్మల్ని ఒకసారి భోజనానికి పిలవరా?" అన్నారు రఘునోట్లో ఆలూభాత్ ముద్ద పెట్టుకుంటూ.

"అవునురా ఈ ఆదివారం రామా!" అన్నాను నేను, ముక్కలోని పులుపుని ఆస్వాదిస్తో...

"వాడు పిలిచేదేమిటి? మనందరం ఆదివారం నాడు వాడింటికి వెళుదాం" అన్నాడు నారాయణ ఆలుబాత్ చివరి ముద్ద మింగుతూ.

"పోతే ఎన్నిగంటలకి రమ్మంటావురా?" అన్నాడు రంగనాథం.

"వాడిని అడిగేదేమిటి? పదిగంటల కల్లా వెళ్ళిపోదాం" అన్నాడు రఘు.

"మీరింత తొందరపడితే లాభంలేదు. రేపు సాయంత్రం మా ఆవిడ పుట్టింటికి వెళుతున్నది. వచ్చిన తరువాత మిమ్మల్ని భోజనానికి పిలుస్తా" నన్నాడు విశ్వేశ్వరరావు మాకు గుండెల్లో రాయి పడ్డది.

"రేపు మధ్యాహ్నం టిఫిన్‌కి వస్తావా?" అని అడిగాడు రఘు.

"రేపు ఆమె పుట్టింటికి వెళ్ళే తొందరలో వీడికి టిఫిన్ ఎక్కడ చేసి పెడుతుందిరా?" అన్నాడు రామనాథం.

"ఇంతకీ నా భార్య సంగతి మీకేమీ తెలియదన్నమాట" అని అందుకున్నాడు విశ్వేశ్వరరావు.

తెలియని విషయంలో జోక్యం కలుగజేసుకోవడం బాగుండదని నేను మౌనం వహించాను.

"తెలియడానికేముంది? పుట్టింటి ప్రయాణపు తొందరలో ఏస్త్రీ అయినా భర్తని మరిచిపోవడం అతి సహజం" అని అన్నాడు రంగనాథం ధీమాగా.

"అక్కడే నీవు పొరబడుతున్నావు- యితర స్త్రీల విషయంలో నీవు చెప్పిన సంగతి నిజం కావచ్చు. కాని నా భార్య విషయంలో అది వర్తించదు. వెళ్ళేరోజున, యింట్లో అన్ని ఏర్పాట్లు చేసి పోతుంది. ఏర్పాట్లు అంటే మీకు అర్థం కాకపోవచ్చు. వంటకోసం మనిషిని కుదిరిస్తుంది. పనిమనిషిని వేరే నియమిస్తుంది. దానికి చేయవలసిన పనులన్నీ నిర్దేశిస్తుంది. తను లేనిలోటు ఎక్కడా కనపడకండా అన్నివిధాలా జాగర్త పడుతుంది. ఆమెలేనిరోజుల్లో నాకు ఒక మనిషి మాత్రమే కనపడదు కాని, అన్ని పనులూ ఆమె వుండి నిర్వహిస్తున్నట్లే తోస్తుంది. కాగా ఎక్కువ రోజులు ఆమె నన్ను వదిలి వుండలేదు. నేను ఆమెని పుట్టింటినించి తీసుకురావలసిన అవసరం ఉండదు. నేను అనుకున్నవాటికల్లా, కలలోని దేవతలాగా ఇంట్లో ప్రత్యక్షమవుతుంది."

"మాకు నీ భార్యని చూపించరా?" అన్నాను నేను ప్రాధేయపూర్వకమైన గొంతుతో...

"తొందర పడతావెందుకు? ఆమె పుట్టింటినించి తిరిగిరానీ" అన్నాడు విశ్వేశ్వరరావు.

రెండుగంటలైంది. విధిలేక మేము ఆఫీసు గదుల్లోని వెళ్ళాం.

అది దారభ్యతా మిగిసిన మిత్రుల కందరికీ, విశ్వేశ్వరరావు భార్య దేవతైతె తెలిసింది. ఆఫీసర్‌కి బదులు, రోజూ ఆమెని జపిస్తూవుండేవాళ్ళం "ఇళ్ళలో ఏవైనా పదార్థాలు చెడిపోతే చెడిపోకుండా వుండడం అసహజం కనక విశ్వేశ్వరరావు భార్యని చూసైనా బుద్ధితెచ్చుకోరాదండీ" అని మామా భార్యల్ని హెచ్చరించేవాళ్ళం. మేము నలుగురం కలుసుకున్నప్పుడల్లా, ఆమె ప్రసక్తే ఎందుకో ఆమెని మాడాలనీ, ఆమె చేతిమీదుగా భోజనం చేయాలనీ, వీలుంటే వాళ్ళింటికి సకుటుంబంగా వెళ్ళాలని వుండేది. రోజులు గడిచిపోతు

న్నాయి. విశ్వేశ్వరరావు అప్పుడప్పుడు మధ్యాహ్న సమావేశాలకి వస్తూనే వున్నాడు-"నీ భార్య పుట్టింటినించి తిరిగి వచ్చిందా" అని ఒకమాటు అడిగితే, ఇంకా రాలేదన్నాడు. ఇంకొకసారి అడిగితే, "వచ్చిందికాని వంట్లో నెమ్మదిగాలే"దన్నాడు. ఆమె తిరిగివచ్చిన తరువాత విశ్వేశ్వరరావు తెచ్చేతినుబండారాలు రుచిగానూమారాయి "నీవు ఎక్కడ వుంటున్నావురా?" అని ఒకనాడు విశ్వేశ్వరరావుని అడిగితే, "ఎక్కడ వుంటే మీ కెందుకురా? ఒకనాడు నేనే వచ్చి స్వయంగా మిమ్మల్ని భోజనానికి తీసుకెడుతానుగా" అని అన్నాడు. కాని ఎప్పటికప్పుడూ భోజనంమాత్రం వాయిదా పడుతున్నది. విశ్వేశ్వరరావు ఏవో కారణాలు చెబుతాడు. కొన్నిరోజుల తరువాత అతను సాకులు చెబుతున్నాడనితోచింది. "భార్య చాలా అందకత్తె కావచ్చు-అందుకోసం మనల్ని పిలవడానికి సంకోచిస్తున్నాడ"ని, ఒకనాడు నాతో రామనాథం అన్నాడు

నాకూ రామనాథం మాటల్లో కొంత సత్యం కనపడింది. 'మనం, అంత నీచులమనుకున్నాడా" అని, రఘు చర్రున లేచాడు. "మనకళ్ళకి ప్రపంచమంతా మనకగా కనపడుతుంది" అని నారాయణ వ్యాఖ్యానించాడు.

"అదికాదు, కొందరి తత్వమే అంత" అని రామనాథం సర్దివేయడానికి చూచాడు.

"మమ్మెప్పై భోజనానికి పిలుస్తే, నీ భార్యని లేవదీసుకుపోతామనా నీ భయం" అని ఒకనాడు రఘు, విశ్వేశ్వరరావు మొహంమీద అనేశాడు. "ఒకమాటు మా యింటికివస్తే మీరు మీమీ భార్యల్నీ,సంసారాల్నీ మరిచిపోయి, మా ఇంట్లోనే వుండిపోతారేమోనని నా భయం" అని చిరునవ్వుతో సమాధానం చెప్పాడు విశ్వేశ్వరరావు-రోజులు గడిచిపోతున్నాయి. కాని విశ్వేశ్వర దగ్గరనించి ఆహ్వానం రావడంలేదు. కొన్ని రోజుల తరువాత, రఘు, రామనాథాల పట్టుదల సడలిపోయింది-కాని అతను తప్పించుకొని తిరుగుతున్న కొద్దీ, నాకు మరీ అతని భార్యని చూదామన్న పట్టుదల హెచ్చింది. ఆ యింటి అమరిక కళ్ళారా చూడాలనీ ఆమె వడ్డిస్తే భోజనంచేయాలనీ, నా భార్యని ఆమెకు పరిచయం చేయాలని నిశ్చయించుకున్నాను. ఎక్కడ వుంటాడో అతన్ని కనుక్కొని లాభంలేదని, ఒకనాడు ఆఫీసులో హెడ్‌క్లర్కు దగ్గర అతని అడ్రస్ తీసుకున్నాను. మిగిలిన ముగ్గురికి చెబితే, అసలు విషయానికే మోసం వస్తుందని, ఒకనాడు రామనాథానికి, "ఎల్లుండి ఆదివారం విశ్వేశ్వరరావు యింటికి వెడుదామని" చెప్పాను. ఆఫీసునుంచి అడ్రస్ సంపాయించిన సంగతి చెప్పాను. మిగిలిన యిద్దరికీ చెప్పకండా వుండడానికై అతనిదగ్గర హామీపొందాను - ఆ తరువాత ఆదివారంకోసం, ఎదురిచూడడం మొదలెట్టాను. మధ్యనున్న రెండు రోజులు గడిచిపోక, సత్యాగ్రహం చేస్తున్నాయి-క్షణాలని యుగాలుగా మారుస్తున్నాయి.

* * *

భళ్ళున ఆదివారం వచ్చింది. హృదయం ఎగిరి గంతులేసింది. రిక్షా వేసుకుని నేరుగా నేను రామనాథం యింటికి వెళ్ళాను. కాఫీత్రాగి వెడదామంటే వీల్లేదనీ, దారిలో ఏ కాఫీహోటల్లోనో తాగుదామని చెప్పి, అతన్ని యింట్లోంచి లాక్కొవచ్చి నడివీధిన పడేశాను. హోటల్‌లో కాఫీ తాగి, రిక్షా మాట్లాడుకొని, రిక్షాలో ఎక్కాము. రిక్షా గిర్రున వెడుతున్నది అది పరుగెత్తుతున్న కొద్దీ, ఎంతోకాలంనించి అనుకుంటున్న పనిని సాధిస్తున్నానని, నాకు మరీ ఉత్సాహం హెచ్చినది. విశ్వేశ్వరరావు అడ్రస్ మెదడులో గింగురమంటున్నది. 'ఎ-17-234, చూడీబజార్" కళ్ళముందు ఎదురుగా కనపడుతున్నది. థర్డు గ్రేడు క్లర్కు పెద్ద హర్మ్యంలో వుండడు. ఏదో చిన్న కొంపలో పడివుంటాడు-కొంప చిన్నదైనా, విశ్వేశ్వరరావు యిల్లు, ఎంతో పొందికగా వుంటుంది. ఎక్కడ వుండవలసిన వస్తువు అక్కడ కనపడుతుంది. విశ్వేశ్వరరావు మొదట ఆశ్చర్యపోతాడు. ఆ తరువాత లోపలికి ఆహ్వానిస్తాడు. ఎంత అనుమానం మనిషైనా, చివరకు విధిలేక భార్యని పరిచయం చేయిస్తాడు. ఇన్ని రోజుల నించీ భోజనానికి పిలువక తప్పించుకు తిరుగుతున్నందుకు క్షమాపణం చెప్పుకుంటాడు. అతని భార్య దోషిగా కళ్ళు దించేసుకుంటుంది. అతని తప్పునకు తాను బాధ్యురాలని ఆ కళ్లు చెప్పలేక క్షమాపణ చెబుతాయి.

ఇంతలోకే చూడీబజార్ వచ్చేసింది. ఇంటి నెంబరుతో ఇల్లు కనుక్కోవడం కష్టమని, రిక్షా డబ్బులు యిచ్చేసి, కాలినడికను బయల్దేరాము. ఎ-17-135 యిల్లు కనపడంది. అక్కడెక్కడో వుంటుందని చుట్టుపక్కలంతా తిరిగాం—అమాంతంగా ఎ-17-300 యిల్లు కనపడింది. పక్కసందులోకి మళ్ళితే ఎ-17-98 కనపడింది తిరిగితిరిగి వేసట వచ్చింది. ఎన్ని సందులు తిరిగినా, అవసరమైన ఇల్లు కనపడలేదు.

ఇక సందులవెంబడి తిరగడం లాభంలేదని ఒక యింట్లోకి దూరి A-17-234 యిల్లు ఎక్కడ వుందని ఆ యింట్లో ఒక పెద్దమనిషిని అడిగాము. తెలియదని అతను అన్నాడు. విశ్వేశ్వరరావు ఎక్కడ వుంటారని అడిగాం. మళ్ళీ అతను తెలియదన్నాడు. ఇంకోయింటికి వెళ్ళాం. అక్కడా ఇంతేజరిగింది. మూడు, నాలుగు, అయిదు...ఏ ఇంట్లో అడిగినా లాభం లేకపోయింది. ఇకవెళ్ళిపోదామనే ఉద్దేశ్యంతో చివరి ప్రయత్నంగా ఒక యింట్లోకి దూరాం.

"ఏ విశ్వేశ్వరరావు!" అని ఒక నడి ఈడు మనిషిఎదురు ప్రశ్నించాడు.

అతని యింటిపేరు, ఏ ఆఫీసులో పని చేసేదీ, మొదలైన వివరాలన్నీ చెప్పాం—

"ఆఁ, ఆఁ, ఆ విశ్వేశ్వరరావా? పక్కసందు వుంటాడే!" అన్నాడు.

"పక్కసందులో, ఏ ఇల్లు."

"కుడిచేతి వేపు మూడోయిల్లు."

తిరిగి ఉత్సాహం మారక్తనాళాల్లో ప్రవేశించి, అలసటని తరిమివేసింది. బయటికి గంతులేసాం పక్కసందులో పడ్డాం. మూడవ యింట్లోకి వెళ్ళాం.

ఎదురుగా గదిలో విశ్వేశ్వరరావు.

గదిలో ఒక కొయ్యకు చొక్కా, కోటు, ప్యాంటు తగిలించివున్నాయి. ఒక మూలకి రెండు మాసిన చొక్కాలు ఒక ప్యాంటు పడివున్నాయి. ఆపక్కనే, జోళ్ళు మాసిన మేజోళ్ళూ ఉన్నాయి వీటికి సరిగా ఎదురుగా వున్నమూలకి, ఒక కుంపటి పొయ్యిపైన, ఒక గిన్నె—దానిపైన కూడా ఒక చిన్నమూత—పక్కన అన్నం తిన్న కంచం మజ్జిగ ఆరిపోయి, కలుపుతున్న గీతలతో వుంది. ఇంకొక మూలకి ఏవో రెండు పుస్తకాలు మడతచెరిగి గదిలో కొంతభాగం వరకు పరుచుకొని ఉన్న ఒక పత్రిక—విశ్వేశ్వరరావు చింకిచాపపైన కూచొని మడత పెట్టివున్న గొంగడి పక్కకు ఆనుకున్నాడు. చొక్కాకాని, బనియన్‌కాని తొడుక్కోలేదు. సన్నని మూడుపోగుల జంధ్యం, అపసవ్యంగా పడివుంది. బుజంపైన మూడుపోగులు విడిపోయి, స్పష్టంగా కనపడుతున్నాయి. రామనాథం జంధ్యంపోగులు గమనించినట్లున్నాడు. ఏదో అనబోతుండగా చప్పున కాలుతొక్కాను. ఎవ్వరమూ, ఏమీ మాట్లాడలేదు. మేము రెండు నిముషాలపాటు గదిగుమ్మంలో నిలుచున్నాం. విశ్వేశ్వరరావు కూర్చోమనికాని, లోపలికిరమ్మని కాని అనలేదు. తలదించేసుకున్నాడు. ఎదురుగా గోడపైన ఒక క్యాలెండర్‌లో తల్లి ఏపుగా ఎదిగిన కుర్రవాడిని, చేతులపైన ఎగరవేస్తున్నది. పిల్లవాడు ఎగురుతూ సంతోషంగా నవ్వుతున్నాడు. తల్లి తన ఆనందాన్ని పట్టలేక మారునవ్వుతున్నది. రెప్ప వాల్చకండా ఒకమాటు ఆ క్యాలెండర్‌ని దీర్ఘంగా చూచాను. తల్లి తెల్లటి చీర కట్టుకున్నది. పట్టంచు తెల్లటి రవిక తొడుక్కున్నది. కొప్పులో మల్లెపూలు పెట్టుకుంది. నాకు కళ్ళల్లో అమాంతంగా నీళ్ళునిండాయి. క్యాలెండర్‌ని ఒకటే పనిగా చూడటం వల్లనో ఏమో? ..

చప్పున రామనాథం చెయ్యి పట్టుకొని, గది గుమ్మంలోంచి వెలుపలికి లాగాను. నలుసు ఏమైనా పడిందేమో రామనాథం కళ్ళుకూడా చెమ్మగిలి వున్నాయి. ఇంటివెలుపలికివచ్చి మా మా యిళ్ళ దారి పట్టాము. తెల్లటిచీర...పట్టంచు రవిక... మల్లెపూలు...విశ్వేశ్వరరావు గది...దారి పొడుగునా నాకు కళ్ళల్లో ఆడుతున్నాయి ..చివరకి విశ్వేశ్వరరావుగది, అన్నపుగిన్నె, ఇనుపకుంపటి, మాసిన చొక్కాలు, ప్యాంటు, రెండుపుస్తకాలు, పత్రిక, ఎంగిలికంచం అన్నీ కలిసి సుడిగుండంగా మారాయి. ఆ సుడి గుండంలో చీర, రవిక, మల్లెపూలు పడి గిర్రున తిరిగి నీటిలో కరిగిపోయినాయి.